క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో రంజాన్



విద్యుత్ దీపాలంకరణలో స్థానిక పెద్ద మసీదు, ఆకాశంలో కన్పిస్తున్న నెలవంక

ఆకివీడు: రంజాన్ నెల ప్రారంభం కావడంతో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు ప్రారంభించారు. పలు మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఐదు గంటలకు ఉపవాసం ఉపసంహరించుకుని మసీదులో ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి ఆకాశంలో నెలవంక ఏర్పడటంతో రంజాన్ నెల ప్రారంభమైంది. స్థానిక పెద్ద మసీదు, తీగలదొడ్డిలోని మసీదు వద్ద, కోసూరువారి వీధిలోనూ, ముస్లిం వీధిలోని చిన్న మసీదు వద్ద ప్రార్థనలు చేశారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ భువన

ఆకివీడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి (సూపరింటెండెంట్)గా డాక్టర్ భువనను నియమిస్తూ ఏలూరు డీసీహెచ్‌ఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె శనివారం నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సూపరింటెండెంట్‌గా డాక్టర్ గణేష్ పని చేశారు.

బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం(ప్రకాశంచౌక్): గునుపూడి రథోత్సవంలో కరెంట్ స్తంభం పడి గాయపడిన బాదితురాలిని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పరామర్శించారు. భీమవరం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బండి రాజేశ్వరిని ఎమ్మెల్యే అంజిబాబు పరామర్శించారు. చికిత్స విషయాలను ప్రమాద ఘటన విషయాలను వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు.

భావనా రుషి స్వామికి ప్రత్యేక పూజలు

అత్తిలి: మంచిలి గ్రామంలో పద్మశాలి కులస్తుల కుల దైవం భావనా రుషి స్వామి వారి వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి మొములేటి ప్రసాద్, కోశాధికారి మోములేటి శ్రీనివాస్, బోడా నరసింహమూర్తి, వెలిదిండి సత్యనారాయణ, పెండెం రాంబాబు, బోనుకొండ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం 10 గంటల నుంచి టీటీడీ కల్యాణ మండపం (సత్యవతినగర్) ఆవరణలో నిర్వహిస్తున్నట్లు వాసవిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పసుమర్తి అనిల్, మండ బ్రహ్మాజీ, (వపన్), ముత్తా శ్రీధర్ గుప్తాలు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుల చేశారు విజయవాడ కామినేని ఆసుపత్రి, చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ వై.నిశ్చల్, డాక్టర్ బి.దివ్యశ్రీ, డాక్టర్ ఎల్.వర్ధన్, డాక్టర్ ఎ.నరేంద్రల పర్యవేక్షణలో న్యూరో, జనరల్ మెడిసిన్, కార్డియాలజిస్ట్, గుండె సంబంధిత వ్యాధులు, ఆయాసం, ఉబ్బసం, శ్వాసకోస వ్యాదు లు, షుగర్, బీపీ, పక్షవాతం తదితర సమస్యలు ఉన్నవారికి పరీక్షలు, ఉచిత మందులు అందజేస్తారని తెలిపారు. 2డీ ఎకో, ఎలక్ట్రోథెరపీ, ఫిజియోథెరపీ, ఈసీజీ పరీక్షలు కూడా చేస్తారని పేర్కొన్నారు. రక్తపరీక్షలు కోసం ఉదయం పరగడపున రావాలని, శిబిరం వద్ద అల్పాహారం అందజేస్తామని స్పష్టం చేశారు.

105 మందికి రక్తపరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి నెలా నిర్వహించే ఉచిత షుగర్ రక్తపరీక్షల శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని లయన్ కొత్త సూర్య రమేష్ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనతా ట్రస్ట్ ఆవరణలో రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మందికి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ పుట్ట విజయశ్రీ, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, వంగపండు రామ్మోహనరావు, పచ్చ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి నీడ కరువు

- శిథిలావస్థలో రామాలయాలు
- పట్టించుకోని పాలకులు, ధార్మిక వేత్తలు
- 100 ఏళ్ల చరిత్రకు ప్రత్యక్ష ఆనవాళ్లు



పెదపేటలో శిథిలమైన రామాలయం

ఆకివీడు: మమ్ము బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ అంటూ రాములోరికి చెప్పమని రామదాసు వేడుకున్నాడు. కాని నేడు సాక్షాత్తు ఆ రాములోరికే కష్టాలు తప్పడం లేదు. నాడు అరణ్యవాసం చేస్తే నేడు భక్తుల ఆదరణకు నోచుకోక అజ్ఞాత వాసంలో ఉన్నట్లుగా ఈ రామాలయం ఉంది. 100 ఏళ్ల రామాలయ చరిత్రకు ఆనవాళ్లుగా ఆలయంలోని శ్రీరామచంద్ర ప్రభు, సీతమ్మ, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలే ప్రత్యక్ష సాక్షులుగా శిథిలమైపోయాయి. పూర్వం ఈ ప్రాంతంలో రామ భక్తులు రామాలయాన్ని నిర్మించి, సీతారాములోరికి ధూప దీప నైవేద్యాలు సమర్పించేందుకు భక్తులు భూరి విరాళాలు, పొలం కేటాయించారని పెద్దలు చెబుతున్నారు. కొన్నాళ్లు రాములోరికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆ తరువాత ఆలయం భక్తుల ఆదరాభిమానాలకు దూరమైపోయింది. సుమారు 50 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యంతో ఈ రామాలయం శిథిలమైపోయింది. శ్లాబ్ కుప్పకూలిపోయింది. విగ్రహాలు పూజకు నోచుకోకుండా మూలన పడ్డాయి. వందల సంవత్సరాలుగా అయోధ్య రామాలయం కోసం పోరాడి ఫలితం సాధించి, అద్భుతమైన ఆలయాన్ని నిర్మించారు. దేశంలోని శిథిలమైన రామాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు ప్రకటించాయి. అయితే ఈ రామాలయం వైపు పాలకులు కన్నెత్తి చూడకపోవడంతో గత కొన్నేళ్లుగా ఆదరణకు నోచుకోలేదు. దీంతో శిథిలమైపోయింది. విలువైన ఆస్తులు ఉన్న రామాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ధూపదీప నైవేద్యాలు పునరుద్ధరించే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు. అదే విధంగా నియోజకవర్గంలో పాలకోడేరు మండలంలోని కోరుకొల్లు, కుముదవల్లి, వేంద్ర, మోగల్లు, శృంగవృక్షం, పెన్నాడతో పాటు నియోజకవర్గంలోని పలు దళిత, ఇతర ప్రాంతాల్లో రామాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు శిథిలావస్థలో ఉన్న రామాలయాల పునర్నిర్మాయణానికి నిధులు కేటాయించే వారు. ప్రస్తుతం నిధులు మంజూరు కావడం లేదని చెబుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రామాలయాలు శిథిలావస్థకు చేరకున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఈ రామాలయాలపై దృష్టి సారించి వీటికి పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



రామాలయంలో చరిత్రకు ప్రత్యక్ష ఆనవాళ్లుగా మిగిలిన విగ్రహాలు

స్త్రీ ఓ శక్తి స్వరూపిణి



పీఎస్‌ఎం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ మహిళా దినోత్సవం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రతి స్త్రీ ఓ శక్తి స్వరూపిణి అని, సృష్టికి ప్రతి సృష్టి మహిళ అని ప్రభుత్వ కేడీఎస్ పీడీ లక్ష్మీకాంతం అన్నారు. విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. లక్ష్మీకాంతం మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు మహిళల కట్టు బొట్టు నడవడికకు నిదర్శనమన్నారు. 40 ఏళ్లుగా మహిళా దినోత్సవ వేడుకలను వారోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అధ్యాపకురాలు జేడిగుంట సునీత, నాచు శ్రీవల్లి, మహిళ పోలీస్ హెడ్ ఎండీ షేహనాజ్, ఎండీ సరోజినీ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, బాల్య వివాహాలు అనర్థమని ఇటువంటి ఘటనలను ప్రతిఘటించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, రంగవల్లుల పోటీలు, మహిళ సాధికారతపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ, కలిగోట్ల గోపాలశర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రెహమాన్

మహిళల రక్షణపై అవగాహన

అంతర్జాతీయ మహిళా దినోత్సవం–2025ను పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మహిళలు, విద్యార్థినులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మహిళా భద్రతే ప్రాధాన్యంగా పని చేస్తున్నామని డీఎస్పీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సైబర్ క్రైం, పోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాల గురించి బాలికలకు వివరించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై ఎం.రెహమాన్ మాట్లాడుతూ ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు యోగ, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, పాటల, నృత్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

నీటి ఎద్దడిపై రైతుల నిరసన



బీటలు వారిన పంట చేల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అత్తిలి: ఈడూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆవదొడ్డి ఆయకట్టు ప్రాంతానికి దాళ్వా పంటకు సాగునీరు అందక వరి చేలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆ ప్రాంత రైతులు చేలల్లో దిగి నెరలు తీసిన చేలల్లో దుబ్బులు తీసి సాగునీరు అందించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా రెండు పర్యాయాలు సార్వా పంట పూర్తిగా పాడై నష్టం వాటిల్లిందన్నారు. మూడో దఫా పంట ఊడ్చు లేక 400 ఎకరాలు వదిలేశామని, నష్టపోయిన రైతులకు ఎటువంటి పరిహారం ప్రభుత్వం అందించలేదని వాపోయారు. ప్రస్తుత దాళ్వా సాగులో ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టామని, తీరా పంట ఈనిక దశకు వచ్చే సరికి సాగునీరు అందక వరి చేలు బీటలు వారుతున్నాయని, దీంతో పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి కౌలు వ్యవసాయం చేస్తున్నామని, సాగునీరు సరఫరా సక్రమంగా లేకపోవడంతో దాళ్వా సాగులో దిగుబడులు తగ్గి నష్టపోయే పరిస్థితి నెలకొందని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే తమ ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, రైతులు సంకు లక్ష్మణరావు, బొక్కా యాకోబు, వానపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదియోగి పంచక్షేత్ర దర్శిని బస్సులను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదియోగి పంచక్షేత్ర దర్శిని బస్సులను ప్రయాణీకులు, భక్తులు, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏపీఎస్ఆర్‌టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ద్వారపూడి సమీపంలోని 60 అడుగుల ఎత్తులో నిర్మించిన ఆదియోగి విగ్రహ దర్శనం, ద్వారపూడి అయ్యప్పస్వామి దర్శనం, బిక్కవోలులో లక్ష్మీగణపతి స్వామి దర్శనం, పంచారామక్షేత్రం ద్రాక్షారామం భీమేశ్వరస్వామి ఆలయం, ఏడువారాల వాడపల్లి వెంకన్న దర్శనాలు జరుగుతాయని చెప్పారు. బస్సు ప్రతి ఆదివారం ఉదయం 5 గంటలకు డిపో నుంచి బయలుదేరి సాయంత్రం డిపోకు చేరుతుందని, టిక్కెట్ ధర రూ.350గా నిర్ణయించామన్నా రు, 50 మంది భక్తులు కోరితే ఏ రోజైనా బస్సును నడుపుతామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 25488, 73829 05856, 99597 53102, 99855 44411 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అందనంత దూరంలో ఫైర్‌స్టేషన్

- అగ్ని ప్రమాదాలు జరిగితే తీవ్ర నష్టం
- మండలంలో ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు



రాయకుదురులో ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

వీరవాసరం: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో అగ్నిమాపక వాహనం త్వరితగతిన వచ్చి మంటలను అదుపు చేస్తే ప్రమాద నష్టాన్ని తగ్గించొచ్చు. ప్రమాదం జరిగిన సందర్భంలో అగ్నిమాపక వాహనం ఆలస్యంగా వస్తే తీరని నష్టం వాటిల్లి బాధిత కుటుంబం రోడ్డున పడుతుంది. వీరవాసరం మండలంలో అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవడంతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాల్లో బాధిత కుటుంబాలు తీవ్ర నష్టాలకు లోనై కట్టుబట్టలతో రోడ్డును పడుతున్నారు. వీరవాసరం మండలంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమవరం నుంచి గాని 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకొల్లు నుంచి గాని 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుమంట్ర నుంచి గాని అగ్నిమాపక వాహనం రావాల్సి ఉంటుంది. వాహనం వచ్చేలోపే పూర్తిగా ప్రమాద నష్టం వాటిల్లుతుంది. గత వారంలో వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలో తోట రాంపండు, గన్నిపిరెడ్డి అమ్ములుకు చెందిన రెండు పోర్షన్ల తాటాకిల్లు అగ్ని ప్రమాదానికి లోనైంది. చుట్టుపక్కల వారు ఆర్పడానికి ప్రయత్నం చేసినా మంటలను అదుపు చేయలేకపోయారు. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడం ద్వారా పాలకొల్లు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చింది. అయితే ఆ లోపే బాధిత కుటుంబానికి జరగాల్సిన నష్టం వాటిల్లింది. పూర్తిగా మంటల్లో ఇంట్లో ఉన్న అన్ని వస్తువులు కాలి బూడిదయ్యాయి. అగ్ని మాపక వాహనం వచ్చే సరికి మంటల తీవ్రత తగ్గిపోయింది. సిబ్బంది నిప్పులను అదుపు చేసి ఇంట్లో ఉన్న సామాన్లు తీశారు. అప్పటికే బీరువాల్లో ఉన్న బట్టలు, నగలు, వస్తువులు అగ్నికి ఆహుతి అయిపోయాయి. ఇటువంటి సందర్భంలో మండల కేంద్రమైన వీరవాసరంలో అగ్నిమాపక వాహనం ఉన్నట్లయితే నష్టం ఇంతలా వాటిల్లేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

> **వీరవాసరంలో ఏర్పాటు చేయాలి**
>
> మండల కేంద్రమైన వీరవాసరంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసి అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలి. అగ్ని ప్రమాదం జరిగితే సుదూర ప్రాంతాల్లో ఉన్న భీమవరం, పాలకొల్లు, పెనుమంట్ర నుంచి రావాల్సి ఉంటుంది. ఈ లోపే తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లుతుంది. బాధితులు రోడ్డున పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించాలి.
>
> – డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ (రాజు), సినీ రచయిత, రాయకుదురు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న నేతలు

వీరవాసరం: రాయకుదురులో జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి ఆదివారం పలువురు ఆర్థిక చేయూత, సామగ్రి అందించారు. వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి రూ.10 వేల నగదు, కొణితివాడ మాజీ సర్పంచ్ ఎరకరాజు చినబాబు రూ.5 వేల నగదును, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా అందజేశారు. భీమవరానికి చెందిన చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అడ్డాల రాము, ఎంపీటీసీ కడలి నెహ్రూ, చెరుకువాడ రంగసాయి, జవ్వాది దాశరథి శ్రీనివాస్, తోట విజయ్‌కుమార్, ఎరక రాజు, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు



దిరుసుమర్రు గ్రామంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో మహాశివరాత్రి 72వ ఉత్సవాల్లో భాగంగా గంగా భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు రామలింగేశ్వరస్వామి వార్లకు పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చన, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం అనుమతించారు. అనంతరం పలు వంటకాలతో తయారు చేసిన అన్న ప్రసాదాన్ని సమర్పించారు. ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ అల్లూరి బంగారాజు, కమిటీ సభ్యులు కలిదిండి పేరాజు, మైగాపుల గంగారాం ఇళ్ల బాబు, నక్కా రామోజీ, కొప్పెర్ల సత్యనారాయణ, చెన్ను త్రిమూర్తులు, నక్కా పండు, చిట్టూరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చికెన్, కోడి గుడ్డుపై అపోహలొద్దు



చికెన్, కోడి గుడ్లను తింటున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శంకర్, రైతులు

తణుకు అర్బన్: కోళ్లలో ఎటువంటి వైరస్ లేదని నిస్సందేహంగా చికెన్, కోడి గుడ్లు ఆహారంగా తీసుకోవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. వేల్పూరు ఎన్టీఆర్ పార్కులో ఆదివారం పౌల్ట్రీ ఫెడరేషన్ వేల్పూరు జోన్ రైతులు నిర్వహించిన చికెన్ మేళాలో ఆయన మాట్లాడారు. చికెన్, కోడి గుడ్లను ఉడికించి వండుకుని తినడం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. వేల్పూరులో రెడ్‌జోన్ మినహా ఎక్కడా కూడా చికెన్, కోడి గుడ్ల అమ్మకాలపై ఎటువంటి ఆంక్షలు లేవని నిరభ్యంతరగా ఆహారంగా తీసుకోవచ్చని సూచించారు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ప్రకటించారని గుర్తు చేశారు. వైరస్ కారణంగా పౌల్ట్రీ రంగాన్ని తీవ్రంగా కుదిపేసిందని చికెన్, కోడి గుడ్లు అనుసంధానంగా నడిచే వ్యాపారాలు ఇబ్బందుల్లో పడ్డాయన్నారు. ఈ సందర్భంగా చికెన్ వంటకాలతో పాటు కోడి గుడ్లను పశు సంవర్ధకశాఖ అధికారులు, రైతులు తిన్నారు. అనంతరం చికెన్ మేళాకు హాజరైన ప్రజలకు చికెన్ వంటకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తణుకు మండల పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ శంకర్ భావన్నారాయణ, పౌల్ట్రీ రైతులు పెనుమర్తి మోహన్, జీవీఆర్ చౌదరి, పి.రంగారావు, పి.సారథి, ఎన్.కిషోర్, ముల్లంగి మాధవరావు, యు.చిరంజీవి, ఎన్.సుబ్బారావు, బోడపాటి ఆనంద్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలి



ఎల్.అగ్రహారంలో సమావేశమైన వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తుందని, ఆ విషయాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, గొల్లగూడెం, అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో పార్టీ గ్రామ, అనుబంధ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి గ్రామ కమిటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల కమిటీ సభ్యులు తమ్మిశెట్టి రఘు, వెలిశెట్టి నరేంద్రకుమార్, చేబోయిన కృష్ణ, గుడ్ల నాగరాజు, సాదే ప్రసాద్, శీలి మాతయ్య, కామన గణపతి, కామన శ్రీను, అయినపర్తి శ్రీను, తారమట్ల శ్రీనివాస్, నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, ముద్రగడ లలిత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్‌లో ఆదివారం సాయంత్రం త్యాగరాజ స్వామి వారి 84వ ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. త్యాగరాజు గాన సభ అధ్యక్ష, కార్యదర్శులు గరికిపాటి బాపయ్య శర్మ, సరస్వతుల హనుమంతరావు పర్యవేక్షణలో ఉదయం త్యాగరాయ కృతులు ఆలపించారు. సాయంత్రం సర్వేపల్లి సిస్టర్స్ డాక్టర్ శ్రేయ, డాక్టర్ రాజ్యలక్ష్మి గార్ల గాత్ర కచేరి నిర్వహించారు. వైలన్‌పై సరస్వతుల పార్థివ్, మృదంగంపై పెరవలి జయభాస్కర్, ఘటంపై సరస్వతుల హనుమంతురావు కృతలు ఆలపించారు.

బీవీఆర్‌లో యాళ్లబండి తాతారావు సంస్మరణ సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ హరికథా భాగవతార్ యాళ్ళబండి తాతారావు సంస్మరణ సభ నిర్వహించారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో భక్త కుచేల హరికథ గానం ప్రముఖ భాగవతార్ నాయని లక్ష్మికుమారి గానం చేశారు. వైలన్‌పై వీరా ప్రసాద్, మృదంగంపై సరస్వతుల హనుమంతరావులు సహకరించారు. మనోరమ, దాసరి కాశీ విశ్వనాదం, డీపీఎస్ వర్మ, ఈపూరి సత్యనారాయణ, పావని నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

పేకాట శిబిరంపై దాడి

ఇరగవరం: మండలంలోని పెద్దిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై జానా సతీష్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి రూ.15,550 నగదు, నాలుగు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఇరగవరం విద్యార్థి

ఇరగవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.దుర్గామల్లేశ్వరరావు సెంట్రల్ జోన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు పాఠశాల హెచ్‌ఎం జి.నాగమణి తెలిపారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానాలు సాధించినట్లు వివరించారు.